ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
ఆదివారం 31 మార్చి 2024



ఉపాధి వేతనం పెంపు

బొబ్బిలి, మార్చి 30: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేసే వేతనదారులకు రోజువారీ కూలి రేటును కేంద్ర ప్రభుత్వం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతవరకు రూ.272 ఉన్న వేతనాన్ని రూ. 300కు పెంచింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది జాబ్‌కార్డు దారులకు ప్రయోజనం చేకూరుతుంది. పనులకు సంబంధించి జాతీయ స్థాయిలో ఒకే సాఫ్ట్‌వేర్‌ను తాజాగా అమలులోకి తెచ్చారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వేతనదారులు పనులు చేయాలన్న నిబంధనను ప్రస్తుతం అమలు చేస్తున్నారు.

ఒడిశాకు ఝలక్

- మైనింగ్ తవ్వకాల సన్నాహక పనులను అడ్డగించిన కొరియా గ్రూపు గిరిజనులు
- రహదారిపై బైఠాయింపు, ర్యాలీ

సాలూరు రూరల్, మార్చి 30: వివాదాస్పద ఏవోబీ ప్రాంతం.. కొఠియా గ్రూప్ గ్రామాలపై ఆధిపత్యం కోసం దూకుడుగా వ్యవహరిస్తోన్న ఒడిశా రాష్ట్ర అధికారులకు శనివారం గిరిజనులు ఝలక్ ఇచ్చారు. మైనింగ్ తవ్వకాల సన్నాహాలను అడ్డుకున్నారు. కొఠియా గ్రూప్ ఎగువశెంబి, దిగువశెంబి, ధూళిభద్ర గ్రామాల గిరిజనులు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ పనులకు ఎన్నికల కోడ్ వర్తించదా? అంటూ ప్రశ్నించారు. వివరాల్లోకి వెళ్తే.. ఏపీ మైదాన గ్రామం నేరేళ్లవలసకు సమీపంలో దేవ్ కొండల్లో భాగమైన ఎగువశెంబి కత్తుల కొండ వద్ద మైనింగ్ తవ్వకాల వ్యూహంతో ఒడిశా ప్రభుత్వ అధికారులు సన్నాహక పనులు ప్రారంభించారు. కొద్దిరోజుల కిందట ఈ ప్రాంతంలో ఉన్న చెట్లను కొట్టి చదును చేశారు. శనివారం నీటి కోసం రిగ్ బోర్‌తో తవ్వకాలు, ఇతర పనులు చేపట్టారు. కాగా మైనింగ్ తవ్వకాలకే పనులు చేస్తున్నారని భావించిన ఎగువశెంబి, దిగువశెంబి, ధూళిభద్ర గిరిజనులు సీపీఎం కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, గిరిజన సంఘం మండల నేత వంతల సుందరరావు ఆధ్వర్యంలో ఉద్యమించారు. సన్నాహక తవ్వకాల కోసం వచ్చిన యంత్ర పనులను అడ్డుకున్నారు. మైనింగ్ కోసం కాదని, విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం పనులు చేస్తున్నామని ఒడిశాకు చెందిన వారు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ గిరిజనులు ససేమిరా అన్నారు. కోడ్ అమలులో ఉండగా.. ఈ పనులేమిటని నిలదీశారు. తమ భూములకు ముప్పు వాటిల్లే ఈ చోట ఈ పనులు చేయొద్దని డిమాండ్ చేశారు. రిగ్ యంత్రం, తదితర వాటితో సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయేలా చేశారు. అంతకముందు కొఠియా- నేరేళ్ల వలస రహదారిపై గిరిజనులు బైఠాయించారు. అనంతరం ర్యాలీ చేశా రు. ఒడిశాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒడిశా మైనింగ్ సన్నాహాలు చేస్తున్న ఏపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై మండిపడ్డారు.



కత్తుల కొండ వద్ద ఒడిశా మైనింగ్ తవ్వక సన్నాహక పనులను అడ్డుకుంటున్న కొఠియా గ్రూప్ గిరిజనులు



ఒడిశా పనులకు వ్యతిరేకంగా కొఠియా-నేరేళ్లవలస రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఇరు రాష్ట్రాలు ఆరా

కొఠియా గ్రూప్ గ్రామాలైన ఎగువశెంబి, దిగువశెంబి, ధూళిభద్ర గిరిజనులు దేవ్ కొండల్లో శనివారం ఒడిశా ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన ఉద్యమంపై ఏపీ, ఒడిశా ప్రభుత్వాలు ఆరా తీశాయి. ఇరు రాష్ట్రాల చెందిన నిఘా వర్గాలు, పోలీసులు ఈ విషయమై తమ ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చారు.

ఏపీ జోక్యం చేసుకోవాలి: సీపీఎం

కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా దూకుడుపై ఏపీ ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పీసా చట్టం అమలవుతుండగా ఏవోబీలో దేవ్ కొండల్లో భాగమైన కత్తుల కొండ వద్ద ఒడిశా ప్రభుత్వం మైనింగ్ తవ్వకాలకు ఎలా అనుమతులిస్తుందని ప్రశ్నించారు. కొఠియా గ్రామాలపై సుప్రీంకోర్టు స్టేటస్ కో ఉండగా, గ్రామసభ అనుమతి లేకుండా ఏ పనులైనా ఎలా చేపడతారని మండిపడ్డారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం: కలెక్టర్

పార్వతీపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా సిబ్బందికి శిక్షణ అందించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. జిల్లాకేంద్రంలో ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్‌ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేలా ప్రతి నియోజకవర్గంలో ఈవీఎం, వీవీప్యాట్‌లపై సిబ్బందికి శిక్షణ అందించనున్నామన్నారు. దీనికోసం నియోజకవర్గ స్థాయిలో ఆరు ఈవీఎంలను అందిస్తామని చెప్పారు. ఈవీఎంలపై సందేహాలను నివృత్తి చేసి ఎన్నికలు సాఫీగా జరిగే విధంగా చర్యలు చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సిబ్బంది సూచించారు. ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని కోరారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన...

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా వెబ్ కాస్టింగ్ ద్వారా ఆంధ్రా, ఒడిశా సరి హద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను పరిశీలించారు. జీపీఎస్ సిస్టంతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల వాహనాలున్న ప్రదేశాలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో ప్రసారమవుతున్న కార్యక్రమాలు, వార్తలపై నిఘా, సి-విజిల్ ఫిర్యాదుల నమోదు, తదితర అంశాలపై చర్చించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ పరిశీలనలో జేసీ శోభిక, కంట్రోల్ రూం ఇన్‌చార్జి అధికారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కాళ్లపారాణి ఆరకముందే..

- వివాహమైన కొన్ని గంటల్లోనే నవ వధువు మృతి
- దబ్బగడ్డలో విషాదం

మక్కువ: కాళ్ల పారాణి ఆరకముందే .. ఓ నవ వధువు తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయింది. వివాహమైన కొన్ని గంటల్లోనే మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఈ విషాద ఘటన శనివారం దబ్బగడ్డలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దబ్బగడ్డ గ్రామానికి చెందిన వారణాసి తిరుపతిరావు, పద్మ దంపతుల కుమారుడు భాస్కరరావు, పార్వతీపురం మండలం కొత్తవలస గ్రామానికి చెందిన ఊళ్ల అఖిల (19)కు శుక్రవారం రాత్రి ఘనంగా వివాహం జరిగింది. దబ్బగడ్డలో రాత్రి ఒంటిగంట వరకు పెళ్లి వేడుకలు జరిగాయి. ఆ తర్వాత నవ వధూవరులను అంతా ఆశీర్వదించారు. బంధువులు, కుటుంబ సభ్యులంతా అర్ధరాత్రి వరకూ సంబరాల్లో మునిగితేలారు. అనంతరం వారంతా సేదతీరారు. అయితే శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో నవ వధువు తీవ్ర అస్వస్థతకు గురైంది. తీవ్ర అలసటతో వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు ఆమెకు గ్రామానికి చెందిన వైద్యుడితో ప్రథమ చికిత్స చేయించారు. నయం కాక పోవడంతో మక్కువ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి సాలూరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే నవ వధువు మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఇరు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలు అఖిలకు తల్లిదండ్రులు లేరు. తాతయ్య ఇంటి వద్దే ఉంటుంది. కాగా పెళ్లి వేడుకల అనంతరం నూతన వధూవరులు ఆనందంగా తమ జీవితాలను గడుపుతారని అంతా భావించారు. అయితే వివాహమైన కొన్ని గంటలకే నవ వధువు కన్నుమూయడంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మక్కువ ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు.



అఖిల (ఫైల్)

డీఎస్సీ పరీక్షలు వాయిదా

- ఎన్నికల తరువాతే నిర్వహణ

సాలూరు రూరల్,మార్చి 30: డీఎస్సీ పరీక్షలపై ఉత్కంఠ వీడింది. ఈ పరీక్షలు ఎన్నికల కోడ్ ముగిసిన తరువాతే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సీఈవో ముఖేష్‌కుమార్ మీనా శనివారం స్పష్టత ఇచ్చారు. మెగా డీఎస్సీ తీస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం నాలుగున్నర ఏళ్లలో ఎటువంటి ప్రకటన చేయలేదు. పాలన చివరిలో గత నెల 12న మినీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ మేరకు గత నెల 25 వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి జిల్లా ప్రాతిప్రదికగా ఎస్జీటీలు 103, పాఠశాల సహాయకులు 97, టీజీటీ 84 మొత్తంగా 284 ఉపాధ్యాయ ఖాళీలను చూపించారు. వాటికి వేలాదిగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. డీఎస్సీలో టీఆర్టీ పరీక్షలు ఈ నెల 15 నుంచి జరగాల్సి ఉంది. టెట్ ఫలితాలు ప్రకటించిన మరునాడు టీఆర్టీ పరీక్షలపై అభ్యంతరం వ్యక్తం చేస్తు పలువురు కోర్టుకు వెళ్లారు. కోర్టు ఈ పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని ఆదేశించింది. దీంతో విద్యా శాఖ రీ షెడ్యూల్ చేసింది. ఈ మేరకు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 3 వరకు రోజుకు రెండు విడతలుగా ఎస్జీటీల నియమానికి , వచ్చే నెల 7న టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాల్ పోస్టుల కోసం ఆంగ్ల భాష ప్రావీణ్య పరీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. వచ్చే నెల 13 నుంచి 30 వరకు పాఠశాల సహాయకులు, టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీ కోసం అర్హత పరీక్షలను నిర్వహించడానికి భావించారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు వెళ్లాయి. డీఎస్సీ పరీక్షల విషయమై కేంద్ర ఎన్నికల సంఘం సూచన మేరకు ఎన్నికల కోడ్ ముగిసిన తరువాతే పరీక్షల నిర్వహణ, టెట్ ఫలితాలు ఉంటాయని రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో మీనా ప్రకటించారు. దీంతో డీఎస్సీ అభ్యర్థులకు మరింత సమయం లభించినట్టయ్యింది.

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- సాల్వెన్సీ సర్టిఫికెట్ కోసం రూ.3వేలు డిమాండ్
- రూ.2,600 తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయిన వైనం


మక్కువ: ఏసీబీ వలకు ఓ పంచాయతీ కార్యదర్శి చిక్కారు. సాల్వెన్సీ సర్టిఫికెట్ కోసం లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలో కన్నంపేట గ్రామానికి చెందిన చీకటి గణపతి తండ్రి ఆదినారాయణ సారా కేసులో ఇటీవల అరెస్ట్ అయ్యారు. ప్రస్తుతం ఆయన జైలులో ఉండగా బెయిల్ కోసం ఇద్దరు వ్యక్తుల ఆస్తుల పూచీకత్తుతో సాల్వెన్సీ సర్టిఫికెట్ అవసరం. దీంతో గణపతి కాశీపట్నం పంచాయతీ కొండరేజారు గ్రామంలో బంధువులను ఆశ్రయించాడు. కాగా బంధువులు ఆస్తులు కాశీపట్నం పరిధిలోనే ఉండడంతో గణపతి సాల్వెన్సీ సర్టిఫికెట్ కోసం ఆ పంచాయతీ కార్యదర్శి పెంట మురళీని బుధవారం సంప్రదించారు. అయితే రూ. మూడు వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తన వద్ద అంత నగదు లేదని, ఇవ్వలేమని గణపతి వేడుకున్నా.. కార్యదర్శి అంగీకరించలేదు. చివరకు రూ.2,600 ఇచ్చేందుకు గణపతి అంగీకరించాడు. అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి అసలు విషయాన్ని చెప్పాడు. ఈ మేరకు ఏసీబీ అధికారుల సూచనలతో గణపతి శనివారం కాశీపట్నం సచివాల యంలో రూ.2,600 కార్యదర్శి మురళీకి అందించగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా ఆయన్ని పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని కార్యదర్శపై కేసు నమోదు చేశారు. ఏసీబీ డీఎస్పీ టి.రామచంద్రరావు, ఇన్‌స్పెక్టర్లు మహేశ్వరరావు, శ్రీనివాసరావు, రమణ పాల్గొన్నారు.



ఏసీబీకి పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి మురళీ

టెన్త్ తర్వాత ఏంటి?

- విద్యార్థి భవిష్యత్‌కు ఇదే కీలక దశ
- ఏం చదవాలనేదానిపై క్లారిటీ ముఖ్యం
- ఉపాధి అవకాశాలు, జీవిత లక్ష్య సాధనకు కోర్సులెన్నో..
- సరైన నిర్ణయం తీసుకుంటే.. ఉన్నత భవిత మీదే..





(సాలూరు రూరల్, మార్చి 30)

పదో తరగతి పరీక్షలు ముగిశాయి. మరికొద్ది రోజుల్లో ఫలితాలు రానున్నాయి. అయితే ఈలోపుగా విద్యార్థులు నెక్స్ ఏంటనేది ఆలోచించుకోవాల్సి ఉంది. ఏ కోర్సులో చేరాలి.. ఏం చదివితే ఉపాధి అవకాశాలు పొందొచ్చనేది తెలుసుకోవాలి. ఆ దిశగా అడుగులు వేయాలి. జీవితంలో త్వరగా స్థిరపడేందుకు టెన్త్ తర్వాత ఎన్నో కోర్సులున్నాయి. అయితే విద్యార్థులు తమ అభిలాషకు తగిన కోర్సును ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. వైద్య, ఇంజినీరింగ్, ఫైనాన్షియల్ తదితర రంగాల్లో అడుగు పెట్టాలనుకునే వారు, వివిధ వృత్తి విద్యల్లో చేరాలనుకునే వారు ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర కోర్సుల్లో చేరొచ్చు. జీవిత లక్ష్య సాధనకు ఏ విద్యాభ్యాసం చేయాలో తెల్సుకోవాల్సిన సమయమిదే. తల్లిదండ్రులు కూడా దీనిపై దృష్టి సారించి విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు అందించాల్సి ఉంది. టెన్త్ తర్వాత ఉన్నత భవిష్యత్‌కు దోహదపడే పలు కోర్సుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

- **ఎంపీసీ:** విద్యార్థి ఇంజినీరింగ్ కెరీర్‌కు ప్రాధాన్యం ఇస్తే ఇంటర్మీడియట్‌లో ఎంపీసీలో చేరాల్సి ఉంటుంది. మేథ్స్ ప్రధానమైన సబ్జెక్ట్‌గా ఉంటుంది. గణితమంటే ఆసక్తికలవారు ఎంపీసీని ఎంపిక చేసుకోవడం ఉత్తమం. ఇంటర్మీయట్‌లో రెండేళ్ల పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్‌లో బీఈ , బీటెక్ , బీఎస్సీ, బీఎస్సీలో కంప్యూటర్, డిప్లమో ఇన్ ఇంజినీరింగ్, మార్చంట్ నేవి కోర్సు, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ , బీసీఏ , బీబీఎం తదితర కోర్సుల్లో చేరి కెరీర్‌లో తొందరగా స్థిరపడొచ్చు.

- **బైపీసీ :** సైన్స్ అంటే ఆసక్తి గలవారు, వైద్య రంగంలో స్థిరపడాలనుకునే వారు ఇంటర్‌లో బైపీసీలో చేరడం ఉత్తమం. బైపీసీ అనంతరం ఎంబీబీఎస్ విద్య కోసం నీట్ పరీక్షను రాయాల్సి ఉంటుంది. బీపీటీ, డిప్లొమో ఇన్ బయోటెక్నాలజీ, బీఎస్సీ ఇన్ బయో టెక్నాలజీ, బీఎస్సీ అగ్రికల్చర్, బీ.ఫార్మసీ, డెంటల్ సైన్స్, డిప్లమో ఇన్ ఫోరెన్సిక్, బీఎస్సీ ఇన్ ఫోరెన్సిక్, బీఎస్సీ నర్సింగ్, ఆయూష్ కోర్సులు, మైక్రో బయోలాజీ, వెటర్నరీ కోర్సులను కూడా పూర్తి చేయొచ్చు.

- **ఎంఈసీ:** గణితం, ఎకనామిక్స్, కామర్స్‌లో ప్రావీణ్యం సాధించడానికి ఎంఈసీని ఎంపిక చేసుకోవచ్చు. ఎంఈసీ ద్వారా ఇటు ఇంజి నీరింగ్, అటు అకౌంటెన్సీ కెరీర్ వైపు వెళ్లవచ్చు.

- **సీఈసీ:** కామర్స్ (కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్) ప్రధానంగా ఉండే విద్య కోరుకునే వారు ఈ కోర్సులో చేరవచ్చు. ఇంటర్ అనంతరం బీకాం, ఎంకాం, ఐసీడబ్ల్యూఏ, సీఏ తదితర కోర్సుల్లో చేరొచ్చు.

- **హెచ్ఈసీ:** చరిత్ర (హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్) ప్రాధాన్యంగా సాగే కోర్సు ఇది. సామాజిక రంగాల వైపు కెరీర్‌ను ప్లాన్ చేసుకునే విద్యార్థులు ఇందులో చేరొచ్చు. హెచ్ఈసీ అనంతరం బీఏ, బీకామ్‌ల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయొచ్చు.

- **ఎంబైపీసీ, సీఈజీ:** మాథ్స్, బయోలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ (ఎంబైపీసీ), కామర్స్, ఎకనామిక్స్, జియోగ్రఫీ (సీఈజీ) కోర్సుల్లో చేరే విద్యార్థులు గ్రాడ్యుయేషన్‌లో అప్పటికి తమ కెరీర్‌కు అనుకూలంగా ఉన్న కోర్సుల్లో చేరొచ్చు.

- **ఇంటర్‌లో వృత్తి విద్యా కోర్సులు:** ఇంటర్‌లో ఒకేషనల్ వృత్తి విద్యా కోర్సులున్నాయి. ఆఫీస్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రీయల్ మేనేజ్‌మెంట్, బేసిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ అండ్ సేల్స్‌మేన్, ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ ప్రోసిజర్ డాక్యుమెంటేషన్, ఇన్సూరెన్స్, డెంటల్, మల్టిపర్పజ్ హెల్త్ వర్కర్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, క్లినికల్ అసిస్టెంట్ తదితర కోర్సులున్నాయి.

- **పాలిటెక్నిక్:** పాలిటెక్నిక్ కోర్సులు చేయడానికి తొలుత ప్రవేశ పరీక్షను రాయాల్సి ఉంటుంది. పాలిటెక్నిక్‌లో డెయిరీ టెక్నాలజీ, ఇన్‌ఫ్రాస్ట్రక్టర్, మైనింగ్, ఏరోనాటికల్, సివిల్, ఎన్విర్నామెంట్, మోటార్ స్పోర్ట్స్, ప్రొడక్షన్, ప్లాస్టిక్, అగ్రికల్చర్, ఎలక్ట్రికల్, పెట్రోలియం, టెక్స్‌టైల్, పవర్ ఇంజినీరింగ్‌లో డిప్లమో కోర్సులు చేయొచ్చు.

- **ఐటీఐ:** పదో తరగతి తరువాత ఇంటర్ వైపు కాకుండా ఉపాధి,వృత్తి విద్యాకోర్సుల్లో సైతం చేరొచ్చు. ఈ మేరకు ఐటీఐ (ఇండస్ట్రీయల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్)లో కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రా మింగ్ అసిస్టెంట్ , డెస్క్‌టాప్ పబ్లిషింగ్ ఆపరేటర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎల క్ట్రిషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్స్‌ట్రుమెంట్ మెకానిక్, ఫిట్టర్, డీజిల్ మెకా నిక్, ఇంటీరియర్ డిజైన్ అండ్ డెకొరేషన్, రేడియాలజీ తదితర 31 కోర్సులున్నాయి.



పి.కోనవలస కేంద్రం నుంచి పరీక్షలు రాసి వస్తున్న పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తుల స్వీకరణ: జేసీ

పార్వతీపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్లు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12డీ దరఖాస్తులు సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక కోరారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు గాను దివ్యాంగుల హక్కు చట్టం, 2016 సెక్షన్-2 కింద సంబంధిత అధికారి ధ్రువీకరించిన సర్టిఫికెట్ (కనీసం 40 శాతం వైకల్యం కలిగి ఉండాలి) ఉండాలని తెలిపారు. దానిని ఫారం-12డీ దరఖాస్తుతో జత చేయాలన్నారు. సీనియర్ సిటిజన్లు, 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు వయసు ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుందన్నారు. రిటర్నింగ్ అధికారి ధ్రువీకరించిన అరులైన ఓటర్ల ఇళ్లను బీఎల్‌వో సందర్శిస్తారన్నారు. నోటిఫకేషన్ విడుదలైన ఐదు రోజుల్లోగా ఓటరు నుంచి ఫారం-12డీని బీఎల్‌వో సేకరించి రిటర్నింగ్ అధికారికి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఫారం-12డీలో సరైన వివరాలు ఉన్న ఓటర్లందరికీ పోస్టల్ బ్యాలెట్ పేపర్ జారీ చేస్తారని తెలిపారు. సూక్ష్మ పరిశీలకులతో పోలింగ్ అధికారుల బృందం ఫారం-12డీ దరఖాస్తులో పేర్కొన్న చిరునామా వద్ద ఓటర్లను సందర్శిస్తుందన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

టీడీపీకి అండగా బ్రాహ్మణ కుటుంబాలు

రామభద్రపురం: జిల్లాలో ఉన్న బ్రాహ్మణ కుటుంబాలు టీడీపీకి అండగా ఉంటాయని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ బాదంపూడి నాగరామ లింగేశ్వర శర్మ తెలిపారు. ఇటీవల బ్రాహ్మణ నాయకుడు సంతోష్ కుమార్ మరణంతో ఆ కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ ఆదుకుని రూ.25 వేల చెక్కు అందజేయడం హర్షణీయమని అన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్‌గజపతిరాజు చెక్కును అందించారని తెలిపారు. ఈ సమావేశంలో వెలవలపల్లి శ్రీనివాసులుశర్మ, హర్షవర్ధన్, కొళ్లకూరు బుచ్చిబాబు, బల్జేపల్లి శ్రీకాంత్, తెలగాపు రవిశర్మ, బ్రహ్మాజీ, తులగాపు మూర్తి పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

లక్కవరపుకోట: మండలంలో వడదెబ్బ నివారణకు విస్తృత ప్రచారం చేపట్టారు. అన్ని గ్రామాల్లో దండోరా వేయాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కే.రూపేష్ ఆదేశాలిచ్చారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు బయటకు వెళ్లొద్దని సూచిస్తూ వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేపట్టారు.

నేడు కోండ్రు ప్రచారం

రాజాం: గడిముడిదాం పంచాయతీ పరిధిలోని సీఎస్‌ఆర్ పురం, అమరాంల్లో టీడీపీ రాజాం నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ఆదివారం ఉదయం ఎన్నికల ప్రచారం చేయనున్నారు. సాయంత్రం సంతకవిటి మండలంలోని మండాకురిటి పంచాయతీలో జరగనున్న జయహో బీసీ కార్యక్రమంలో పాల్గొనున్నట్లు కోండ్రు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

రాజాం రూరల్: చంద్రబాబునాయుడితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ విజయనగరం లోక్ సభ నియోజకవర్గ అధికార ప్రతినిధి వంగా వెంకట రావు తెలిపారు. మండలంలోని ఒమ్మి, బొమ్మినా యుడువలసలో టీడీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు సు మల మన్మథరావు తదితరులతో కలిసి శనివారం ఇం టింటా ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌లు రఘుమండల గణపతి, కొయ్యాన జగదీష్ పాల్గొన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

తెర్లాం: తెర్లాం అడ్డు రోడ్డు కూడలిలో స్థానిక ఎస్.ఐ. రమేష్ వాహన చోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. లేనిపక్షంలో అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు. ఆయనతో పాటు హెడ్ కానిస్టేబుల్ ఎ.వి.పి.రాజు, ఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు. **రామభద్రపురం:** మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జ్ఞానప్రసాద్ హెచ్చరించారు. కొట్టక్కి, మిర్తివలస వద్ద శనివారం తనిఖీలు నిర్వహించారు. వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ టెస్టులు చేసి.. ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

టీడీపీ బ్రాహ్మణ విభాగం ప్రచారం

విజయనగరం రూరల్: నగరంలోని 9, 10 డివిజన్ల పరిధిలో శనివారం టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు డాక్టర్ పేరి రామయ్య పంతులు, వడ్డమాని శేఖర్, సుభద్ర, ద్వాదశి వేణుశ్రీనివాస్, సన్యాసిరావు, రమణమూర్తి తదితరులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి అదితి గజపతిరాజు, ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడును గెలిపించాలని కోరారు.

ఐక్యంగా పనిచేయాలి

రాజాం: ఐక్యంగా పనిచేస్తే టీడీపీ విజయం తథ్యమని తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు తెలిపారు. శనివారం సంతకవిటి మండలంలో చిన్నయ్యపేటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కోండ్రు జగదీష్‌లో కలిసి మాట్లాడారు. టీడీపీ గెలుపుకోసం నిరంతరం కష్టపడి పనిచేయాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ విజయం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గట్టి భాను, వల్లూరు గణేష్ పాల్గొన్నరు.

7న గుంటూరులో బహిరంగ సభ

విజయనగరం రూరల్: ఎస్సీ వర్గీకరణ విషయమై ఏప్రిల్ 7న గుంటూరులో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పో రాట సమితి జిల్లా అధ్యక్షుడు బోగి శ్రీను కోరారు. ఎంఆర్‌పీఎస్ నాయకులతో కలిసి అంబేద్కర్ కూడలిలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్న వారికి మంద కృష్ణమాదిగ మద్దతు తెలిపారని, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపిస్తామన్నారు.

పోలింగ్‌లో జాగ్రత్తలు తప్పనిసరి

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు శనివారం శిక్షణ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కిరణ్ కుమార్, ఉపతహసీల్దారు భరత్ కుమార్, కొత్తవలస డీటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి

రాజాం: ఎన్నికల సమయంలో ఏపీవోలు ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి ఎల్.జోషఫ్ సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏపీవోలకు శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గుర్తింపు కార్డును తీసుకొస్తే పరి శీలించి వారు ఓటువేయడానికి అవకాశం కల్పించాలన్నారు. శిక్షణను మెప్మా పీడీ సుధాకర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఎన్నికల డీటీ ప్రకాష్ పాల్గొన్నారు.

కూటమి ప్రయోజనాలే ముఖ్యం

బొబ్బిలి: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రయోజనాలే అత్యంత ముఖ్యంగా భావిస్తూ, వాటి కోసం శ్రమిస్తున్నామని జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణా కార్యదర్శి పాలూరు బాబు అన్నారు. స్థానిక జనసైనికుల నిలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోజకవర్గాల్లో జనసేన కార్యకలాపాలపై కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది స్వార్థపరులు కూటమి మనుగడకు దెబ్బతగిలే విధంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి శక్తులను ఉపేక్షించేది లేదన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యేగా బేబీనాయన గెలుపు కోసం జనసైనికులంతా సేవలందిస్తున్నారని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు సంచాన గంగాధర్, రేవళ్ల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేసేందుకు యువత ముందుకు రావాలి

● జాయింట్ కలెక్టర్ కార్తీక్



జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన జేసీ కార్తీక్

కలెక్టరేట్, మార్చి 30: పట్టణ ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారి శాతం తక్కువగా ఉందని, దీనితో పాటు యువత కూడా ఓటు వేసేందుకు ఆసక్తి చూపడం లేదని, ఆయా వర్గాల వారు వచ్చే సాధారణ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ముందుకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జేసీ కార్తీక్ కోరారు. యువ ఓటర్లు, పట్టణ ప్రజలకు ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పించే నిమిత్తం నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా శనివారం రెండు కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. స్థానిక కోట జంక్షన్ నుంచి ప్రారంభమై రాజీవ్ స్టేడియం వరకూ పరుగులో ట్రైనీ సహాయ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ ఎంఎం నాయుడు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, నెహ్రూ యువ కేంద్రం అధికారి ఉజ్వల తదితరులు పరుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మనదేశంలో యువత అధికంగా ఉన్నారని, ముఖ్యంగా కొత్తగా ఓటరుగా నమోదైన యువత ఓటు విలువ తెలుసుకుని దానిని వినియోగించుకోవడం ద్వారా దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు ఒక పెద్ద పండుగ వంటివని, ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొనాల్సి ఉందని సూచించారు.

డ్రైవర్లకు రూ.26 వేలు జీతం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న తులసీరామ్

విజయనగరం దాసన్నపేట: ప్రజా రవాణా శాఖలో హైర్ బస్సు డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ఏపీ పీటీడీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరాం డిమాండ్ చేశారు. శనివారం హైర్ బస్సు యూనియన్ జిల్లా నాయకులు జేఎస్ఎన్ రాజు అధ్యక్షతన ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2012 నుంచి కనీస వేతన చట్టం సవరణ చేయకుండా ప్రభుత్వాలు కార్మికులను మోసం చేస్తున్నాయన్నారు. తక్షణమే కనీస వేతనాల చట్ట సవరణతో పాటు రూ.26 వేలు అమలు చేయాలని, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రణాళికలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు ఎ.జగన్మోహన్‌రావు, సురేష్, ధనుంజయ్, రాము, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొప్పలవెలమలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న కొప్పలవెలమ సంఘ ప్రతినిధులు

దాసన్నపేట, మార్చి 30: జిల్లాలోని పార్లమెంట్ పరిధిలో కొప్పలవె లమ సామాజికవర్గం అత్యధికంగా ఉన్నారని రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని సంఘ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిలపర్తి పరదేశినాయుడు, జిల్లా అధ్యక్షుడు బొత్స వరప్రసాదరావులు డిమాండ్ చేశారు. శనివారం కామాక్షినగర్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అత్యధిక జనాభా ఉన్నప్పటికీ నిరాదరణకు గురవుతున్నారన్నారు. వ్యవసాయాన్ని అధారంగా చేసుకుని ఎటువంటి వివాదాస్పద కార్యక్రమాల్లో తల దూర్చకుండా కొప్పల వెలమలు ఉండటంతో రాజకీయ పార్టీలు నిరాదరణకు గురిచేస్తున్నాయన్నారు. జిల్లాలో రాజకీయ పార్టీల గెలుపు ఓటముల విషయంలో తమ ఓటు బ్యాంక్ అధార పడిఉందన్నారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు స్పందించి పునరాలోచించాలని లేనిచో అన్యాయం చేసిన పార్టీలకు తగిన గుణపాటం చెపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు తెంటు కాశీనాయుడు, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు



గ్రామస్థులకు సూచనలిస్తున్న సీఐ

రాజాం రూరల్: ఎన్నికల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని రాజాం టౌన్ సీఐ దాడి మోహనరావు హెచ్చరించారు. మునిసిపాలిటీ పరిధిలోని సారధిలో శనివారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివాదాలకు ఆస్కారం కలిగించకుండా సహకరించాలని కోరారు.

అరాచక పాలనకు బుద్ధిచెప్పాలి



లక్ష్మీపురంలో కోండ్రు ఇంటింట ప్రచారం దృశ్యం

రేగిడి: వైసీపీ ప్రభుత్వం అసమర్థ, అరాచక పాలనకు బుద్ధిచెప్పాలని రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహనరావు పిలుపునిచ్చారు. మండలంలో లక్ష్మీపురం, అక్కన్నఆగ్రహారం, ఆడవరం, మజ్జిరాముని పేట, అప్పాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ ప్రభుత్వాన్ని గద్దెదిం చాలన్నారు. కార్యక్రమంలో నాయ కులు గురవాన నారాయణరావు, దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు, గేదల బాలమురళీధర్, గురవాన రమేష్, కర్ణేన మహే శ్వరరావు, గురవాన ధనంజయ్‌రావు, చల్ల భుజంగరావు పాల్గొన్నారు.

రాజాం: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే బీసీల భవిష్యత్తు బాగుంటుందని టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శనివారం రాత్రి డోలపేటలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. నంది సూర్యప్రకాష్‌రావు, పొట్టా చిట్టిబాబు, టంకాల కన్నంనాయుడు, శాసపు రమేష్ కుమార్, గున్న రమేష్, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, డోల రామచంద్రుడు, బీజేపీ నాయకుడు కోటగిరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న సంబరాలు



కృష్ణాపురంలో సంబరాలు చేస్తున్న గ్రామస్థులు

బొబ్బిలి: కృష్ణాపురం గ్రామంలో శనివారం సాయంత్రం గ్రామస్థుల ఇలవేల్పు శ్రీసింహాద్రి అప్పన్న సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి 12 ఏళ్లకోసారి సింహాద్రి అప్పన్న సంబరాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్వామి వారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు సమర్పించుకున్నారు. కోలాటం, తప్పెటగుళ్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం



చింతలపాలెంలో వృద్ధురాలికి సూపర్‌సిక్స్ పథకాలు వివరిస్తున్న కోళ్ల

లక్కవరపుకోట (కొత్తవలస), మార్చి 30: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమ వుతుందని శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి అన్నారు. గెలుపే ధ్యేయంగా ప్రచారం చేస్తున్న ఆమె రోజుకు నాలుగు గ్రామాల చొప్పున తిరుగుతూ ప్రజలను కలుస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం మండలంలోని చింతలపాలెం గ్రామంలో ప్రచారం చేపట్టారు. టీడీపీ-జనసేన, బీజేపీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. సాయంత్రం అర్ఝనాపాలెం, పాత సుంకరపాలెం, యర్రవానిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ప్రజా సంక్షేమం కోసం చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. చంద్రబాబు గెలుపు రాష్ట్ర ప్రజలకు అవసరమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయం గౌరవిస్తా



మాట్లాడుతున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట: ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తానని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. శనివారం శృంగవరపుకోటలో తన వర్గీయులతో సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిశామన్నారు. రెండేళ్లుగా నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు, పరిస్థితులను వివరించానని చెప్పారు. పార్టీ ఓ నిర్ణయం తీసుకున్నందున సపోర్టు చేయాలని లోకేష్ సూచించారన్నారు. కార్యకర్తలు, ప్రజలు కోరితే ఇండిపెండెంట్‌గా నిలబడేందుకు సిద్ధంగా ఉన్నానని తెల్చి చెప్పారు. కేడర్ అభిప్రాయాలు తెలుసుకోనేందుకు ఆదివారం సాయంత్రం స్థానికంగా బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నానన్నారు. విశాఖ పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, కొత్తవలస మండల టీడీపీ అధ్యక్షుడు గోరపల్లి రాము, నాయకులు జుత్తాడ రామసత్యం, పైడిబాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలనకు అంతం తప్పదు



ఎన్నికల ప్రచారంలో అభిమానులు అందించిన ఖడ్గంతో బేబీనాయన

బొబ్బిలి: రాష్ట్రాన్ని తీవ్రమైన ఆందోళనకర స్థితిలోకి నెట్టేసిన వైసీపీ దుర్మార్గపు పాలన అంతమొందడం ఖాయమని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పట్టణంలోని నాలుగో వార్డులో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. చంద్రబాబు హయాంలో మంచి పరిపాలన వచ్చేందుకు అందరూ ఎన్‌డీఏ కూటమికి ఓట్లు వేయాలని అర్థించారు. దావాల వీధిలో పలువురు అభిమానులు బేబీనాయనకు నాగలిని, ఖడ్గాన్ని బహుమతిగా అందజేశారు. ఆయన వెంట బీజేపీ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు మరిశర్ల రామారావునాయుడు, గిరడ అప్పలస్వామి, పెద్దింటి మనోజ్ కుమార్, లంక రమేష్, టీడీపీ నేతలు రాంబార్కి శరత్‌బాబు, రౌతు రామ్మూర్తి, పువ్వల శ్రీనివాసరావు, గెంబలి శ్రీనివాసరావు, వాసిరెడ్డి సత్యనారాయణ, సుంకరి సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో తమకు మేలు జరిగేలా చూడాలని కోరుతూ బేబీనాయనకు జిల్లా తెలగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు చనుమల్లు ప్రసాదరావు వినతిపత్రం అందజేశారు.

వృద్ధులకు ఇంటి వద్దనే ఓటింగ్

వంగర: గ్రామాల్లోని కురువృద్ధులు(84 ఏళ్లపై బడినవారికి) ఇంటివద్దనే ఓటువేసుకునే విధంగా ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని ఎంఈవో దుర్గారావు తెలిపారు. శనివారం ఆయన కింజంగి, మరువాడ, కోనంగిపాడులో ఇంటింటికి వెళ్లి వృద్ధుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులకు సైతం ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

● కాల్వలపై నిర్మాణాలు

● పేరుకుపోతున్న చెత్త నిల్వలు

● చోద్యం చూస్తున్న మున్సిపల్ యంత్రాంగం



మాధవబజార్‌లో కాల్వలను ఆక్రమించి చేసిన నిర్మాణాలు, అంబేడ్కర్ కూడలిలో ఫుట్‌పాత్‌పై నిర్మాణాలు

రాజాం రూరల్: రాజాం మున్సిపాలిటీలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు వెలిశాయి. కాల్వలపై నిర్మాణాలు పెరిగాయి. ఫలితంగా పారిశుధ్య సిబ్బంది కాల్వలు పరిశుభ్రం చేయలేని పరిస్థితి. దీంతో కాల్వలు వ్యర్థాలతో నిండిపోయి దోమల సంతతి పెరిగిపోతోంది. మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా పరిస్థితి భయానకంగా మారుతోంది. అయినాసరే మున్సిపల్ యంత్రాంగానికి దోమ కుట్టినట్లయినా లేదు. రాజాం మెయిన్‌రోడ్డు విస్తరణ సమయంలో కాల్వలపై పలకలు వేసేందుకు వేలాది రూపాయలు ఖర్చు చేశారు. పాదచారుల రాకపోకలకు వీలుగా ఏర్పాటు చేసినా పట్టణ పరిధిలో ఎక్కడా అవి కనిపించడం లేదు. కాల్వలను కప్పేసి నిర్మాణాలు చేపట్టారు. కొందరు బతుకు తెరువు కోసం, మరికొందరు ఆక్రమించి షాపులు అద్దెకిస్తూ నాలుగు రాళ్లు సంపాదిస్తున్నారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఇదే పరిస్థితి. మాధవ బజార్, శ్రీనివాసా రోడ్, బజార్ రోడ్ తదితర ప్రాంతాలలో కాల్వలను వ్యాపారులు ఆక్రమించి తమకు అనుకూలంగా నిర్మాణాలు చేపట్టారు. మున్సిపల్ యంత్రాంగం వీటి జోలికి పోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఈశ్వరరావు (ఫైల్)

దత్తిరాజేరు, మార్చి 30: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పెదమానాపురం ఎస్ ఐ శిరీష తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చుక్కపేటకు చెందిన కొనిసి ఈశ్వరరావు(33) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం మెంటాడ మండలం కుంటినవలస గ్రామంలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి స్వగ్రామమైన చుక్కపేటకు శనివారం వేకువ జామున ద్విచక్రవాహనంపై బయలుదేరి వస్తుండగా కోమటిపల్లి చెరువు దగ్గర జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఈశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా మృతుడుకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి శిక్ష

విజయనగరం క్రైమ్, మార్చి 30: జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో 2023లో నమోదైన గంజాయి కేసులో ఇద్దరు నిందితులకు ఏడాది చొప్పున జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. దీనికి సంబంధించి వన్ టౌన్ సీఐ వెంకట్రావు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం రైల్వేస్టేషన్ సమీపంలో 2023 ఫిబ్రవరి 2న ఇద్దరు వ్యక్తులు గంజాయి ప్యాకెట్లు కలిగి ఉండి అమ్మకానికి ప్రయత్నిస్తున్నారని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో వన్‌టౌన్ పోలీసులు రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుని భర్తకాన శేఖర్, షేక్ ఖరేషిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు వందల గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితునిపై అప్పటి ఎస్సై అశోక్‌కుమార్ కేసు నమోదు చేశారు. సీఐ వెంకట్రావు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నేరారోపణలు రుజువు కావటంతో ఏడాది జైలు శిక్షతో పాటు వెయ్యి జరిమానా విధిస్తూ అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.రమ్య తీర్పునిచ్చారు.

మద్యం సీసాలతో పట్టుబడ్డ మహిళ

బొబ్బిలి: మండలంలోని కారాడ గ్రామానికి చెందిన ఈదుబిల్లి పార్వతి 60 క్వార్టర్ బాటిల్స్, 6 ఫుల్ మద్యం బాటిళ్లతో శనివారం పట్టుబడినట్లు ఎస్‌ఈబీ సీఐ బీపీ మురళీధర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆమె ఇంట్లో తనిఖీలు నిర్వహించగా మద్యసీసాలను గుర్తించామని, దీంతో ఆమెను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఎస్వీ రామారావు, ఎల్.తిరుపతిరావు, హెచ్‌సీ బి.మాధవిదేవి, ఈసీలు బి.ఆదినారాయణ, వై.సరస్వతి పాల్గొనట్లు సీఐ తెలిపారు.

మొబైల్ యాప్స్ గుర్తించడంలో ప్రతిభ

● నోబుల్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్న చిన్నారి



ఎంపీ రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా నోబుల్ వరల్డ్ రికార్డు అందుకుంటున్న బాలుడు కనిష్క కృష్ణ

దాసన్నపేట, మార్చి 30: మొబైల్ ఫోన్‌లో యాప్‌లను గుర్తించి, వాటిని ఆపరేట్ చేస్తున్న రెండేళ్ల బాలుడు నోబుల్ వరల్డ్ రికార్డుకు ఎంపికయ్యాడు. రైల్వేలో ట్రైన్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బగ్గు జగదీష్, బగ్గు యాషికా రమ్య దంపతుల కుమారుడైన రెండేళ్ల కనిష్క కృష్ణ చిన్న వయసులోనే స్మార్ట్ మొబైల్ ఫోన్స్‌లో సుమారు 30 నుంచి 40 యాప్స్ గురించి అడిగిన వెంటనే గుర్తించి తెలియజేస్తున్నాడు. వాటిని ఓపెన్ చేస్తున్నాడు. ఈ పరిజ్ఞానాన్ని గుర్తించిన తల్లిదండ్రులు నోబుల్ వరల్డ్ రికార్డుకు దరఖాస్తు చేశారు. వెంటనే వారు పరిగణలోకి తీసుకుని బాలుడి ప్రతిభను గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డును శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా శనివారం చిన్నారికి అందించారు. చిన్నారి ప్రతిభను గుర్తించిన ఎంపీ తల్లిదండ్రులతో పాటు బాలుడిని అభినందించారు. ఎంపీని కలిసిన వారిలో కింజరాపు వెంకటరమణ తదితరులున్నారు.

అందరూ కలిసికట్టుగా ఉండాలి



మాట్లాడుతున్న రూరల్ సీఐ

రాజాం: అందరూ కలిసికట్టుగా ఉండి ఎన్నికలు నిర్వహించుకోవాలని, ఎటువంటి తగాదాలు పడినా కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తుందని రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. శనివారం రాత్రి సంతకవిటి మండలం వాల్తేరు గ్రామంలో ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించుకుంటే ఇబ్బందులు ఉండవన్నారు. పోలీసు సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కాలువ ఇప్పుడు గుర్తుకొచ్చింది



నగరంలోని అయ్యన్న కోనేరు గట్టు నుంచి దాసన్నపేట మెయిన్ రోడ్డుకి వెళ్లే రహదారికి ఒక వైపు కాలువ నిర్మాణ పనులు కోడ్ వచ్చిన తరువాత ప్రారంభమయ్యాయి. ఎప్పటి నుంచో ఆ కాలువ పనులు పెండింగ్‌లో ఉన్నా పాలకులు .. అధికారులు పట్టించుకోలేదు. నాలుగైదు రోజులుగా కాలువ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఈ విషయమై నగర పాలక సంస్థ కమిషనర్ మల్లయ్యానాయుడును అడగ్గా.. గతంలోనే ఈ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. హడావిడిగా ప్రారంభం కావడం... నాణ్యత లేకపోవడాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారు.

-విజయనగరం రింగురోడ్డు

ఫారం-12డీలను బీఎల్వోలతో సేకరించాలి

● టీడీపీ మండల కన్వీనర్లు కొండయ్య, శేఖర్‌పాత్రుడు


ఏఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న కొండయ్య, శేఖర్‌పాత్రుడు

కురుపాం: సీనియర్ సిటిజన్లు,దివ్యాంగుల ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ల కోసం ఫారం 12డీలను బూత్ లెవల్ అధికారులను మాత్రమే సేకరించాలా చర్యలు తీసుకోవాలని టీడీపీ కురుపాం, కొమరాడ మండల కన్వీనర్లు కేవీ కొండయ్య శేఖర్‌పాత్రుడు కోరారు. ఈ మేరకు వారు నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నిక అధికారి బీఎస్ఎస్ సత్యనారాయణకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు గ్రామాల్లోకి వెళ్లి 12డీలను అందిస్తున్నారని తెలిపారు. దీంతో సీనియర్ సిటిజన్, దివ్యాంగుల ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని వివరించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని ఏఆర్వో తెలిపారు.

దిశ యాప్ మహిళలకు రక్షణ కవచం

● దిశ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ లావణ్య


మాట్లాడుతున్న లావణ్య

పాలకొండ: యువతులు, మహిళలకు రక్షణ కవచం దిశయాప్ అని దిశ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ లావణ్య తెలిపారు. పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులకు శనివారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టంపై వివరించారు. 18సంవత్సరాలలోపు పిల్లలపై ఎవరైనా లైంగిక దాడి, వేధింపులు చేస్తే ఈ చట్టం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. అనంతరం గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు.

ఉపకరణాల నిర్ధారణకు పరీక్షలు



ప్రత్యేకావసరాల బాలలకు పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

పాలకొండ: పట్టణంలోని భవిత కేంద్రంలో జిల్లా సమగ్ర శిక్ష అధికారులు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శనివారం నిర్వహించారు. ఎంఈవో-2 కె.సోంబాబు, ఐఈఆర్‌టీ కో-ఆర్డినేటర్ భానుమూర్తి, ఉపాధ్యాయులు, ఐఈఆర్‌పీలు ప్రత్యేకావసరాలు బాలలకు పరీక్షలుచేశారు. ఈసందర్భంగా పది మంది బాలలకు వినికిడి యంత్రాలు, 22 వీల్‌చైర్లు అవసరమని గుర్తించి నిర్ధారణ చేశారు.

ఒంటి పూట అమలు చేయాలి

● ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనియన్ కార్యదర్శి పార్వతిదేవి

పాచిపెంట:ఎండల తీవ్రత దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఒంటి పూట అమలు చేయాలని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనియన్ కార్యదర్శి కె.పార్వతిదేవి డిమాండ్ చేశారు. మండలంలోని కోడికాళ్లవలసలో శనివారం అంగన్‌వాడీలు సమావేశమయ్యారు. సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన జీవోలు అమలు చేసి అంగన్‌వాడీ ఉద్యోగులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఐసీడీఎస్ బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. మినీ అంగన్‌వాడీ ఉద్యోగులను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలని కోరారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా టుటుదాస్


ఎన్నికైన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

ఒడిశా

రాయగడ: న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా పద్మనాభదాస్ అలియాస్ టుటుదాస్ ఎన్నికయ్యారు. శనివారం స్థానిక కోర్టులో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష పదవి కోసం ముగ్గురు న్యాయవాదుల మధ్య తీవ్ర ఉత్కంఠ రేపిన పోటీ జరిగింది. టుటుదాస్ కేవలం మూడు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. దాస్‌కు 59 ఓట్లు రాగా, ప్రత్యర్థి అభ్యర్థులు జనార్ధన్‌కు 56, బిభుప్రధాన్‌కు 49 ఓట్లు వచ్చాయి. కార్యదర్శిగా బిశ్వనాథ్ గంతాయత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది నొబగంటా వ్యవహరించారు. బార్ అసోషియేషన్ నూతన కార్యవర్గానికి సభ్యులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ఉగాది పోటీలు


మాట్లాడుతున్న కొండబాబు

రాయగడ: జిల్లా ఉత్కళ తెలుగు సమాఖ్య రెండు రోజుల పాటు ఉగాది వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. వై.వెంకటేశ్వరరావు (కొండ బాబు) అధ్యక్షతన వేడుకలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 9గంటలకు లయిన్స్ క్లబ్‌లో మెహందీపోటీ, సాయంత్రం చిన్నారులకు ఫ్యాన్సీ డ్రస్ పోటీలు నిర్వహిస్తామని కొండబాబు తెలిపారు. సోమవారం స్థానిక విజ్ఞాన విద్యాలయ ప్రాంగణంలో ఉదయం పది గంటలకు మహిళలకు సంప్రదాయ దుస్తుల పోటీ, సాయంత్రం రంగోలి పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కొండబాబు కోరారు. విజేతలకు ఉగాది వేదికపై బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు.

48 గంటల్లో సొత్తు రికవరీ

● కేసును చేధించిన చందిలి పోలీసులు


రికవరీ చేసిన చోరీ సొత్తుతో విలేకరులకు వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

రాయగడ: చోరీ జరిగిన 48 గంటల్లో చందిలి పోలీసులు కేసును ఛేదించి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. చందిలి గ్రామంలో నివాసం ఉంటున్న నీలకంఠ సబర్ అనే ఉపాధ్యాయుడు ఈనెల 28 ఉదయం 10 గంటలకు ఇంటికి తాళం వేసుకుని తన విధులకు వెళ్లాడు. ఇదే అదనుగా ప్రదీప్‌జెన అనే యువకుడు తలుపులు బద్దలు కొట్టి ఇంట్లోకి చొరబడి రూ.లక్షా 50వేలు నగదుతో పాటు రెండు జతల బంగారు చెవి రింగులు, టైటాన్ రిస్ట్‌వాచ్, బంగారు ముక్కుపుడకలు, వెండి సామగ్రి దొంగిలించి పరారయ్యాడు. నీలకంఠ విధుల నుంచి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి, తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. ఇంట్లో చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని రంగంలోకి దిగిన పోలీసులు.. చోరీకి పాల్పడింది ప్రదీప్ జెనాగా గుర్తించి, అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును రికవరీ చేశారు.


పార్వతీపురం రూరల్: పుట్టూరులో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న విజయచంద్ర


జియ్యమ్మవలస: మాట్లాడుతున్న కురుపాం అభ్యర్థి జగదీశ్వరి

టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం

● జయహో బీసీ, బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తిన నాయకులు

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నాయకులు తెలిపారు.శనివారం జియ్యమ్మవలసలో జయహో బీసీ, పార్వతీపురం మండలంలోని పుట్టూరు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ప్రభుత్వ వైఫల్యాలపై నాయకులు ధ్వజమెత్తారు.

దీర్ఘకాల సమస్యలు పరిష్కరిస్తా: జగదీశ్వరి

జియ్యమ్మవలస: తనను గెలిపిస్తే నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించి పూర్తిగా అభివృద్ధి చేసి తీరుతానని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన జయహో బీసీ సభలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి పనితీరును ప్రజలకు వివరించారు. కురుపాం నియోజకవర్గ అభివృద్ధి ఆమెకు పట్టలేదని విమర్శించారు.టీడీపీ రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్‌మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా, ఉపముఖ్యమంత్రిగా పుష్పశ్రీవాణి చేసిన అభివృద్ధి శూన్యమని, మళ్లీ ఈ ఎన్నికల్లో డబ్బులు పంచితే గెలిచేస్తామనే భ్రమలో ఆమె ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిక్‌టాక్ మంత్రిగా మంచి ప్రాచుర్యం పొందారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదివేసి డబ్బులు సంపాదనే ధ్యేయంగా, ఆస్తులు కూడబెట్టుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగారని విమర్శించారు. మరోసారి మోసం చేసేందుకు మీ ముందుకు వస్తున్నారని, ఆమెను నమ్మవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. అరకు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి దొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్, తదితరులు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు పూర్తి అన్యాయం జరిగిందన్నారు. బీసీలకు న్యాయం జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని, దానికి మీరందరూ కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం బాబు సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని జియ్యమ్మవలసలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పల్ల రాంబాబు, నాయకులు ఎల్.తాతబాబు, ఎం.సత్యంనాయుడు, లంక గోపాం, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో గెలిపించాలి: విజయచంద్ర

పార్వతీపురం రూరల్: రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర కోరారు. శనివారం మండలంలోని పుట్టూరు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, గొట్టాపు వెంకటనాయుడు, బోను చంటి, నాయుడు, ఆగూరు మణి పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవ సంఘ సభ్యులు



వీరఘట్టం: రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తున్న యువకులు

స్నేహభావం అలవరచుకోవాలి

● పార్వతీపురం, వీరఘట్టంలో 'రన్‌ఫర్ జీసస్'

ప్రతి ఒక్కక్రైస్తవుడు తోటి వారితో మంచిగా ఉంటూ స్నేహభావాన్ని అలవరచుకోవాలని విశాఖ సెనెడ్ బిషప్ సుదర్శన్ పిలుపునిచ్చారు. శనివారం పార్వతీపురం, వీరఘట్టంలో రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు.

● **పార్వతీపురం టౌన్:** ఏసు మరణం సర్వమానవాళి రక్షణ కోసమేనని విశాఖ సెనెడ్ బిషప్ సుదర్శన్‌అన్నారు. ఈస్టర్ పర్వదిన ఉత్సవాల్లో భాగంగా పట్టణ పాస్టర్స్, యువజన విభాగం ఆధ్వర్యంలో జరిగిన రన్‌ఫర్ జీసస్ కార్యక్రమంలో మాట్లాడారు. ఏసు మరణాన్ని గెలిచి ప్రజలను కాపాడేందుకు వచ్చారన్నారు. సర్వమానవాళి ఐకమ్యతమే, ఏసు అభిష్టమన్నారు. మానవాళిని రక్షించడానికి వచ్చిన ఏసుకు మనమంతా రుణపడి ఉంటామన్నారు. అనంతరం రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్, నాలుగు రోడ్ల కూడలి, పాతబస్టాండ్ కూడళ్ల వద్ద పట్టణ ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిషప్ తిమోతీ, పాస్టర్లు సూర్యప్రకాష్, విజయ్‌కుమార్, గోపి, సుధీర్ పాల్గొన్నారు.

● **వీరఘట్టం:** పట్టణంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘ ప్రెసిడెంట్ కె.ప్రేమభూషణరావు, సంఘ కార్యవర్గ సభ్యులు ఆధ్వర్యంలో రన్‌ఫర్ జీసెస్ కార్య క్రమం శనివారం నిర్వహించారు.

అవగాహన లేకపోతే ఎలా బోధిస్తారు..?

● ఎఫ్-4 పరీక్షలపై వివరాలను ఇవ్వలేకపోయిన సిబ్బంది

● అధికారులపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం


గుమ్మలక్ష్మీపురం: అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ప్రవీణ్ ప్రకాష్

గుమ్మలక్ష్మీపురం: డిజిటల్ విద్య బోధనపై ఉన్నత స్థాయి అధికారులకే అవగాహన లేకపోతే విద్యార్థులకు ఏ విధంగా పాఠ్యాంశాలను బోధించగలరని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే నెల నుంచి జరగనున్న ఎఫ్ఏ-4 పరీక్షలు ఎప్పుడు జరుగుతున్న ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వకపోవడంతో మండిపడ్డారు. శనివారం గుమ్మలక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. తొలుత తొమ్మిదో తరగతిలోకి వెళ్లి బోధనపై ఆరాతీశారు. ఈ సందర్భంగా బైజూస్, డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏ విధంగా బోధిస్తారో చూపించాలని డీఈవో పగడాలమ్మకు డిప్యూటీ డీఈవోలు, హెచ్ఎం బిడ్డిక భీముడు సూచించారు. దీంతో వారు డిజిటల్ బోర్డు వద్ద వివరించలేకపోయారు. డైట్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన మీకే బోధనపై కనీస అవగాహన లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా రూ.మూడు వేలు కోట్లతో డిజిటల్ తరగతులు నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తే వాటిపై కనీస అవగాహన లేకపోవడం విచారకరమని తెలిపారు. ఇక్కడ పది మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉండాల్సి ఉండగా 16 మంది ఉన్నా విద్యాబోధన పట్ల ఇంత నిర్లక్ష్యం వహించడంతగదన్నారు. అనంతరం ఎస్కేపాడులో ప్రాథమికపాఠశాలలో నాలుగు,ఐదో తరగతివిద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థులు లెక్కలు వర్క్‌బుక్‌లో చేయక పోవడం, లెక్కలు చెప్పకపోవడంపై ఉపాధ్యాయులు,హెచ్ఎంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.పర్యవేక్షణలోపంపై ఎంఈవోను హెచ్చరించారు. అనంతరం ఓంద్రు బంగి పాఠశాలకు రహదారి లేకపోవడంపై మోటార్ సైకిల్‌పైవెళ్లారు. ఇక్కడ సకాలంలో పుస్తకాలు కూడా పంపిణీ కాకపోవడాన్ని గుర్తించారు. విద్యా ప్రమాణాలు సరిగా లేకపోవడంపై ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కొత్తగూడ ఆశ్రమ పాఠశాలలో ట్యాబ్‌లు వినియోగించకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహంవ్యక్తం చేశారు. ఏజెన్సీలో విద్యా ప్రమాణాలు అధ్వానంగా ఉండడంపై అసహనాన్ని వ్యక్తం చేశారు.ఆయన వెంట ఐటీడీఏ పీవోవిష్ణుచరణ్ ఉన్నారు.కాగా ఎంఈవో-1లు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రవీణ్ ప్రకాష్‌కు ఎంఈవో-1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం వినతిపత్రం అందజేశారు.

ఎంఈవోలు అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మండలాల్లో పర్యటించే సమయంలో ఎంఈవోలు అప్రమత్తంగా ఉండాలని విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ తెలిపారు. శనివారం ఎంఈవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థులు యూనిఫాంలోనే పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలని, ఎన్నికల కోడ్ దృష్ట్యా జగన్ పేరు ఉన్న బెల్టును ధరించకుండా చూడాలని, శనగ చక్కీలను ఇచ్చేటప్పుడు కూడా ప్యాకెట్‌పై ఉన్న జగన్ చిత్రం తొలగించాలని సూచించారు.

స్పందించారు.. సరిచేశారు


స్తంభం సరిచేసిన దృశ్యం

మక్కువ: మండలంలోని కాశీపట్నం గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని సంబంధిత అధికారులు శనివారం సరిచేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన విద్యుత్ స్తంభానికి క్రేదన్ను కథనంపై విద్యుత్‌శాఖాధికారులు స్పందించారు. వాలిపోయిన స్తంభాన్ని నిల్పోబెట్టారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

అన్నప్రసాద నిర్వాహక కమిటీ ఏర్పాటు

గరుగుబిల్లి: చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానం అన్నప్రసాద నిర్వాహక కమిటీని శనివారం ఏర్పాటు చేశారు.ఈ మేరకు చైర్మన్‌గా మోనంగి ప్రకాష్, వైస్ చైర్మన్‌గా గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ గంటా శ్రీనివాసరావు, కార్యదర్శిగా గెంబలి శ్రీరామచంద్రమూర్తి,కోశాధికారిగా మార్కొండ పకీరునాయుడును ఎన్నుకున్నారు.అనంతరం భక్తులకుఅన్న సమారాధన నిర్వహించారు.కార్యక్రమంలో చైర్మన్ ఎం. సత్యనారాయణ, మేనేజింగ్ ట్రస్టీ డి.ధనుంజయరావు, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ డి.పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లివిరిలో డోలోత్సవాలు


రాధాకృష్ణులను దర్శించుకుంటున్న భక్తులు

భామిని:లివిరిలో రాధాకృష్ణ డోలోత్సవాల్లో శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తలనీలాలు సమర్పించారు. తాము పండించిన పంటలను కూడా గోపీనాథస్వామికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని పలువురు రైతులు తెలిపారు. శనివారం ఉదయం నుంచే భక్తులు భారీగా సంఖ్యలో తరలివచ్చారు.

రేపటి నుంచి ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు

జియ్యమ్మవలస: పరజపాడు పంచాయతీ కేంద్రంలో గౌరీ సుందరేశ్వర ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నామని సర్పంచ్ జి.రామకృష్ణంనాయుడు తెలిపారు. ఈ ప్రతిష్ఠా మహోత్సవాలు వచ్చే నెల నాలుగో తేదీ వరకు ఉంటాయని ఆయన చెప్పారు.

రోడ్డుపై నూర్పులు.. తప్పని ఇబ్బందులు


పెదతుంబలి సమీపంలో ప్రధాన రహదారిపై నూరుస్తున్న దృశ్యం

జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడ, తుంబలి పంచాయతీల రైతులు ప్రమాదమని తెలిసినా ప్రధాన రహదారిపైనే కట్టెలు, నువ్వులు, మినుము, తదితర పంటలను నూర్పు చేస్తున్నారు. దీనివల్ల వాహన చోద కులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులకు కల్లాలు లేకపోవడంతో ప్రధాన రహదారిపై నూర్పులు చేస్తున్నారు. అనంతరం మిగిలిన గడ్డి, కట్టెలు, నువ్వులు, మినుము వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేసి తగలబెడుతున్నారు. దీనివల్ల రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు, చెట్లు కాలిబూడిదైపోతున్నాయి. రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వజ్రాయుధాన్ని దుర్వినియోగం చేయొద్దు


పరజపాడులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జియ్యమ్మవలస: ఓటు అనే వజ్రాయుధాన్ని దుర్వినియోగం చేయకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ఇ.చిన్నంనాయుడు ప్రజలను కోరారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో చింతలబెలగాం, పరజపాడు, లక్ష్మీపురం గ్రామాల్లో కేంద్ర బలగాలు, సివిల్ పోలీసులు ఆరు కిలో మీటర్ల దూరం కవాతు నిర్వహించారు.

11 నుంచి బూరుగలో రామాలయ ప్రారంభోత్సవాలు

వీరఘట్టం: మండలంలోని బూరుగలో ఏప్రిల్ 11, 12, 13 తేదీల్లో రామాలయ ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. చందాలు సేకరించి రామాలయ పనులు చురుగ్గా చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గరుగుబిల్లి: వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి కేకే సాగర్‌వర్మ సూచించారు. శివ్వాం, కొత్తూరు గ్రామాల్లో శనివారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత నివారణకు పలు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి మందులు అందించారు. వైద్యులు రఘు, పల్ల శ్రీధర్, ఎస్.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


శివ్వాంలో గర్భిణిని తనిఖీ చేస్తున్న డాక్టర్ సాగర్‌వర్మ